బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

విశాలాంధ్ర - కే.కోటపాడు : మైనర్లను ఏ వృత్తిలోనూ నియమించుకో రాదని అలా చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగు తుందని చోడవరం సహాయ కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ తెలిపారు మండల కేంద్రం కే కోటపాడు లో సోమవారం ఐసిడిఎస్ సిడిపిఓ మంగతాయారుతో కలిసి పలు దుకా ణాలను బేకరీలను షాపులను తనిఖీలు నిర్వహించారు. ప్రమాదకరమైన పనుల్లో 18 సంవత్సరములు లోపు వ్యక్తులను పనిలో పెట్టుకో రాదని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సీడ్స్ సంస్థ తరఫున చిన్నారావు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్ రైతులు, కార్మికుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సాయం క్రింద రూ.35 కోట్లు, ఆధునీకరణకై రూ. 350 కోట్లు విడుదల విడుదల చేయాలి

సి.పి.ఎం. రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్



విశాలాంధ్ర - చోడవరం : గోవాడ సుగర్స్ సభ్య రైతులు, కార్మికులకు తక్షణమే బకాయిలు చెల్లించాలని, ఆధునీ కరణకు రూ.350 కోట్లు, తక్షణ సాయంగా రూ.35 కోట్లు ఇవ్వాలని సి.పి.ఎం. రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనువాసురావు డిమాండ్ చేసారు. గోవాడ సుగర్స్ ను సోమవారం సందర్శించిన సి.పి.ఎం. నేతలు చెరకు రైతులతో మాట్లాడి, వారి కష్టాలను అడిగి తెలిసుకున్నారు. రాష్ట్రంలో సహకార రంగంలో మిగిలిన ఏకైక గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడక పోతే అధికార కూటమి ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ జపం చేస్తున్న సి. ఎం. చంద్రబాబు గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరణ కు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.35 కోట్లు, ఆధునీకరణ కై రూ. 350 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీ వద్ద ఎంతో పలుకుబడి ఉన్న వ్యక్తిగా చెప్పుకుంటున్న స్థానిక ఎం.పీ సి ఎం రమేష్ ఫ్యాక్టరీ కోసం ఎందుకు మోడీని అడగట్లేదని అన్నారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పదేపదే ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న సి.ఎం రమేష్, సుగర్ ప్యాక్టరి లను ఆదుకుంటామని ఎన్నికల్లో ఇచ్చిన హమీని ఎందుకు అమలు చేయలేదని అన్నారు. రైతులు, కార్మికుల కష్టంతో నిర్మించిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కోసం ఒక్కసారైనా ఎందుకు ఢిల్లీ వెళ్లలేదని అడిగారు. ఫ్యాక్టరీని మూసివేస్తే ఎలా సొంతం చేసుకోవాలనే ఆలోచనలో స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారని అన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు గోవాడ సుగర్స్ ను పూర్తి సామర్థ్యంతో నడుపుతామని ఎన్నికల్లోను, క్రషింగుకు ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఫ్యాక్టరీలో ఉన్న దుస్థితి నుంచి బయట పడేయటానికి అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, నిధులను ఎందుకు తీసురాలేక పోతున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎం.పీ, ఎమ్మెల్యేలు చొరవ తీసుకొని సహకార రంగంలో ఉండే ఏకైక ఫ్యాక్టరీని కాపాడడం కోసం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. లోకనాథం మాట్లాడుతూ ఫ్యాక్టరీ ఆధునికరణ, బకాయిలు చెల్లింపులు కోసం నిధులు విడుదలకై ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, ఆర్. శంకర్రావు, జి. శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వి.వి. శ్రీనివాసరావు, జి. వరలక్ష్మి, ఈ. నరసింహమూర్తి, ఎస్వీ నాయుడు, దొర, దేముడు నాయుడు, గండి నాయనబాబు, కర్రి అప్పారావు, సాంబశివరావు, నాగిరెడ్డి సత్యనారాయణ,ఇర్లే నాయుడు, వి.సూర్య నారాయణ, చెరకు రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - సబ్బవరం : మండలంలోని అసకపల్లి పంచాయతీలో భూ కబ్జాలపై చర్యలు తీసుకోవాలని అసకపల్లి గ్రామస్తులు అడపా గణేష్ కుమార్ పిజి ఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. అసకపల్లి సర్వే నెంబర్ 1లో ప్రభుత్వ భూమిని 0.03 సెంట్లు చొప్పున ప్లాట్లు వేసి విఆర్ఓ సర్పంచ్‌తో కుమ్మక్కయి విక్రయిస్తున్నారని పిర్యాధు లో పేర్కొన్నారు.అలాగే సర్వే నెంబర్ 87 లో సుమారు ఎకరా కొండవాగు స్థలంలో అక్రమంగా షెడ్డులు, పునాదులు నిర్మించిన విక్రయించిన స్థానిక వీ ఆర్వో చర్యలు తీసుకోలేదని పిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే ఉన్నతాధికారులు దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతుల సహకారంతో రహదారి నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర - మునగపాక : మండల కేంద్రం మునగపాకలో పలువురి రైతుల సహకారంతో గ్రామ పంచాయతీ నిధులతో రహదారి ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు.మునగపాక గ్రామంలో ఎస్సీ కాలనీ సత్తమ్మ తల్లి గుడి నుండి పాటిపల్లి,వాడ్రాపల్లి జంక్షన్ వరకు రైతుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న రహదారికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి,వైసీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ కోనపల్లి రామ్మోహనరావు, డొక్కా నాగ భూష ణం, దిమ్మల నూకరాజు, గణేష్, బీలా లక్ష్మణరావు మరియు రైతులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో పెదగుమ్ములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ చేయడం జరిగింది. దీనిలో భాగంగా విద్యార్థులుకు అవసరమైన పరీక్షా సామాగ్రిని ఉపాధ్యాయులు ఆర్థిక సహాయంతో విద్యార్థులుకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ ...పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానాన్ని అధిరోహించాలని అన్నారు .ఫలితాలతో పాఠశాల విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థులు ఎక్కువగా నీరు త్రాగాలని ,వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఉపాధ్యాయులు చేసిన సహాయం పట్ల విద్యార్థులు పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసి తమ ఆనందాన్ని ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాడ్రాపల్లిలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి తీర్థ మహోత్సవం

విశాలాంధ్ర - మునగపాక : మండలం లోని వాడ్రాపల్లి గ్రామంలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల వరహా నర్సింగరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ 29వ వర్ధంతి తీర్థ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వ హించారు. పోటీల్లో విజేతలకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు చేతుల మీదుగా బహుమతులు అంద జేశారు.ఈ కార్య క్రమంలో టిడిపి సీనియర్ నాయకులు మళ్ల శేషు, వాడ్రాపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు సూరిశెట్టి రాము పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారం చేయాలి

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల మండలం శంకరం పంచాయతీ శివారు గొప్పూరు, తాడి వలస గిరిజన గ్రామాలకు మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని సోమవారం ఖాళీ బిందెలతో మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఆదివాసి గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రదాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి మద్దతు తెలిపి మాట్లాడారు. మంచి నీటి కష్టాలు తప్పడం లేదని ఇది వరకు ఇంటింటి కుళాయి ఏర్పాటు చేసి పైపులైన్ ద్వారా నీరు అందించడం జరిగిందన్నారు. ఇంటింటి కొళాయిలు ఇచ్చినప్పటినుండి గొప్పూరు గ్రామానికి తాడివలస గ్రామానికి మంచినీరు రెండు రోజులు మించి నీరు రాలేదన్నారు. తరువాత మోటార్ ఆగిపోవడం నీరు రావడం లేదని మోటారు పని చేయక పోవడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటి కైనా ప్రభుత్వ అధికారులు స్పందించి గొప్పూరు తాడివలస గ్రామాలకు మంచినీరు వచ్చే విధంగా చర్యలు తీసు కోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో గిన్నెపల్లి సన్యాసమ్మ, సోలం మంగ, సోలం వరలక్ష్మి, సోలం రాము పాల్గొన్నారు.

ఫార్మా పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - పరవాడ : ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యన్నా రాయణ డిమాండ్ చేసారు. 54వ జాతీయ భద్రత వారోత్సవాల్లో భాగంగా ఫార్మాసిటీలో సోమవారం సీఐటీయు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో 205 ఫార్మా పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్నాయని వీటిలో అధిక ప్రాధాన్యత భద్రతకి ఇవ్వాల్సిన అవసరం ఉన్నప్పటికీ పరిశ్రమ యాజమాన్యాలు భద్రతని గాలికొదిలేస్తున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫార్మా పరిశ్రమల్లో 25 మంది వివిధ ప్రమాదాల్లో మృతి చెందారని గనిశెట్టి గుర్తుచేశారు. మరో 59 మంది అస్వస్థత గురై గాయపడ్డారన్నారు. ఫార్మాసిటీలోని సినర్జిన్ ఫార్మాలో ప్రమాదం జరిగినప్పుడు ఐఏఎస్ మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీ నివేదిక ఏమైందని గనిశెట్టి ప్రశ్నించారు. కార్మిక శాఖ మంత్రి వాస్తవాలను దాచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేవలం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఐదు మంది మాత్రమే మృతి చెందినట్లు పేర్కొనడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాలకు అండగా నిలవడం వల్లనే భద్రత ఆడిట్ సరిగా నిర్వహించలేదన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తించిన లోపాల ఆధారంగా యాజమాన్యాలపై చర్యలు లేకనే యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలను గాలికి వదిలేస్తున్నాయని మండిపడ్డారు. భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారే తప్ప భద్రతకి మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఫార్మా పరిశ్రమల్లో భద్రత ఆడిట్ నిర్వహించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు ఏర్పాటుచేసిన కమిటీ నివేదికను వెంటనే బయట పెట్టాలని గనిశెట్టి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సీటు నాయకులు నాయకులు పిచిన్నారావు, కేదార్ బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

గల్లంతైన యువకుని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - పరవాడ : మండలంలోని భరణికం గ్రామానికి చెందిన బలిరెడ్డి సూర్య లక్ష్మీనారాయణ ఆదివారం స్థానిక పెద్ద చెరువులో గల్లంతైన విషయం తెలిసిందే. ఆ రోజు రాత్రివరకు ఎంత గాలించినా అతని ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం ఈతగాళ్లను రప్పించి గాలించగా మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. భరణికం గ్రామానికి చెందిన సూర్యలక్ష్మీ నారాయణ కొందరి స్నేహితులతో కలిసి స్థానిక పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. స్నేహితులు చెరువు ఒడ్డున కూర్చుని చేపల కోసం నీటిలో గేలం వేయగా లక్ష్మీనారాయణ నీటిలోకి దిగాడు. మధ్యలో కాస్త లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాద వశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. ఒడ్డునున్న స్నేహితులు వెంటనే సూర్యనారాయణ కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఈతగాళ్ల సాయంతో గాలించినా లక్ష్మీ నారాయణ ఆచూకీ లభించలేదు. తిరిగి మంగళవారం గజ ఈతగాళ్లను పిలిపించి చెరువులో వెతికించగా సోమవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపమాక వెంకన్నకు హోంమంత్రి అనిత పట్టువస్త్రాలు

ఘనంగా వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - నక్కపల్లి : ఉపమాకలో వేంచేసిన వేంకటేశ్వర స్వామికి ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత సోమవారం పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీవారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా ఆమె స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో మంత్రికి నాయకులు, దేవస్థాన అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, అంతరాలయంలో మంత్రి అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆశీర్వచనం చేసి, స్వామి వారి తీర్థప్రసాదాల్ని పండితులు అందజేశారు. అనంతరం భరత నాట్య కళాకారుల్ని మంత్రి అనిత ఘనంగా సత్కరించారు. హెూం మంత్రి ఆర్థిక సహాయంతో ఉపమాక ఆలయం వద్ద మజ్జిగ, క్యాలెండర్లు పంపిణీ చేశారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఉపమాక శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని.. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించికుంటున్నారని, గత ప్రభుత్వంలో భక్తులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, కూటమి ప్రభుత్వ హయాంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేపట్టామన్నారు. వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని ప్రార్థించానన్నారు. తిరుమల తిరుపతి స్వామి వారి ప్రసాదం కూడా ఉపమాకలో అందుబాటులో ఉందని తెలిపారు. భక్తులకు మజ్జిగ, భోజనం సౌకర్యం ఏర్పాటు చేశామని, ఎన్డీఏ కూటమికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేసారు.

అవినీతికి పాల్పడుతున్న ఇన్చార్జ్ పంచాయితీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర- సబ్బవరం : మండలంలోని ఆసకపల్లి పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి అవినీతికి పాల్పడుతున్నారని తక్షణమే ఆయనపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఉప సర్పంచ్ కరణం సురేష్ బాబు జిల్లా కలెక్టర్‌కు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రభుత్వ బంజరు స్థలాలలో అక్రమంగా నిర్మించిన ఇళ్లకు, షెడ్డు లకు ఇంటి పన్నులు మంజూరు చేసి అక్రమంగా 50 వేలు చొప్పున డబ్బులు వసూలు చేసి కాజేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే పంచాయతీ తీర్మానం లేకుండా అక్రమ షెడ్ల నిర్మాణం చేపడుతున్న వారికి ఇంటి పనులు ఎలా మంజూరు చేస్తున్నారని ప్రశ్నించారు. అలాగే స్మశాన వాటికలో కొబ్బరి తోటలో కొబ్బరికాయలు వేలం వేసి డబ్బులు పంచాయితీకి జమ చేయకుండా సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. గతంలో పంచాయతీ ఖర్చులు, జమలు వివరాలను పంచాయతీ బోర్డు మీటింగ్ లో 9 మంది వార్డు సభ్యులు ఎన్ని సార్లు అడిగినా కార్యదర్శి చెప్పలేదని ఫిర్యాదు లో పేర్కొన్నారు. అలాగే వీధిలైట్లు కొనుగోలులో అవకతవకలు జరిగినట్లు వార్డు సభ్యులు ఆరోపణ చేశారు. కార్యదర్శి పంచాయతీ జమ, ఖర్చులు బోర్డు మీటింగ్లో 9 మంది సభ్యులకు తెలపాలని గతంలో ఎన్ని సార్లు అడిగినా ఇంతవరకు సమాధానం లేకుండా తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి ఆసకపల్లి పంచాయతీలో జరిగిన అవినీతిని వెలిగి తీసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే పంచకర్లను కలిసిన గోకులపాడు జనసేన నాయకులు

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో గోకులపాడు గ్రామంలోని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబును గ్రామ జనసేన నాయకులు కలిసి స్వాగతం పలికారు. నక్కపల్లి మండలం లో జరిగే జనసేన బహిరంగ సభకు వెళ్తున్న ఎమ్మెల్యేను మండల జనసేన సీనియర్ నాయకులు మత్తి కార్తీక్ ఆధ్వర్యంలో పలువురు కలిసి పరిచయం చేసుకున్నారు. మహిళలు హారతి ఇచ్చి సత్కరించారు ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకురావచ్చు అన్నారు.

104 వైద్య సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - మునగపాక : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో 104 వాహనాలు ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ భీశెట్టి గంగా అప్పల నాయుడు కోరారు. మండలంలో మూలా పేట గ్రామంలో 104 వాహనం ద్వారా వైద్య సేవలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసు కోవాలని అన్నారు. గ్రామంలో అవసరమైన వారందరికీ షుగరు, బీపీ, ఇతర వ్యాధులకు సంబంధించిన మందులను పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్, యామిని, ఏఎన్ఎం రమణి, మెడికల్ సిబ్బంది, ఆశ వర్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కనక మహాలక్ష్మి అమ్మవారి 20వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కశింకోట : మండలం లోని బయ్యవరం గ్రామంలో కనక మహా లక్ష్మి అమ్మవారి 20వ వార్షికోత్సవం వైసీపీ మాజీ మండల అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి అమ్మ వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు కుంకు మార్చన జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించు కున్నారు. మహిళలు చీరె సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని మాజీ శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు, వైసిపి నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మండల ఎంపీపీ కలగా లక్ష్మీ, గున్నయ్య నాయుడు దంపతులు, మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్ దర్శించుకున్నారు. వారికి కమిటీ వారు ప్రత్యేక పూజలు చేయించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో, అమ్మవారి సన్నిధిలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్య క్రమంలో ఎంపీటీసీ గొన్నాబత్తుల నాగ సత్య నారాయణ, గొంతిని శివ బాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు గొల్లవిల్లి నానాజీ, గ్రామ పార్టీ కార్యదర్శి నార్ని శ్రీనివాస రావు, పార్టీ వైసీపీ సీనియర్ నాయకులు జి.గణేష్,కొల్లి వెంకట్రావు, భక్తులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

యువత పోరు విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు

విశాలాంధ్ర -యస్.రాయవరం : వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 12వ తేదీన జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి ఇన్ చార్జ్ మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. సోమవారం అడ్డు రోడ్డులో తమ కార్యాలయం వద్ద యువత పోరు కరపత్రాన్ని విడుదల చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థులతో పాటు అనేక రంగాలు వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు .పెండింగ్ లో ఉన్న ఫీజులు విడుదల చేయాలని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించు కోవాలని డిమాండ్ చేశారు.

పదిలో ప్రతిభావంతులకు ఏ.ఐ.ఎస్.ఎఫ్ బహుమతులు ప్రధానం

విశాలాంధ్ర - చోడవరం : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో పదవ తరగతి నమూనా పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యా విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్లో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంఈఓ సింహాచలం చేతులు మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్ష దోహదపడుతుంది అన్నారు. మొదటిసారి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు భయం, ఆందోళన చెందవద్దన్నారు. పదవ తరగతి మీ భవిష్యత్తుకు తొలి మెట్టు అని తెలిపారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయం లో ఎక్కువ సమయం చదువుకు కేటాయించాలన్నారు. పబ్లిక్ పరీక్షలు బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకువాలన్నారు. ఇలాంటి మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ బృందానికి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేశారు. పాఠశాల హెచ్.ఎం రామి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో అన్ని రంగాలలో రాణించే విధంగా చదువు అనేది ఉండాలని, విద్యార్థులు బట్టి పట్టి చదవడం ద్వారా ఎటువంటి ప్రయోజనం లేదని, జ్ఞానంతో కూడిన విద్య అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబ్జి, ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైయస్సార్ పార్టీ పోరాడుతోంది

విశాలాంధ్ర - యలమంచిలి : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైయస్సార్ పార్టీ పోరాడుతుందని యలమంచిలి మున్సి పాలిటీ పార్టీ అధ్యక్షులు బోద్దపు ఎర్రయ్య దొర అన్నారు. సోమవారం యల మంచిలి వైయస్సార్ పార్టీ కార్యాలయంలో కడపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మాన్ ఫస్ట్ లో సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్మెంట్, వసతి దీవెన 4600 కోట్లు బకాయి ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3000 రూపాయలు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. మెడికల్ కాలేజీ లను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మండల పార్టీ అధ్యక్షులు కొల్లి త్రినాధరావు. యలమంచిలి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గుప్తా, యలమంచిలి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడాల శ్రీను, కౌన్సిలర్లు కిరణ్, దూది నరసింహమూర్తి, వైయస్సార్ పార్టీ నాయకులు దాసరి కుమార్, కొట్టారు కొండబాబు, కోడిగుడ్డు రమణ, పిల్లా త్రినాథ్, గొంపాని శివ, డబ్బీర్ రవి, ఆదారి మహేష్, అంకిరెడ్డి నర్సింగరావు, దాసరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పి.జి.ఆర్.ఎస్. అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

విశాలాంధ్ర - అనకాపల్లి కలెక్టరేట్ : అర్జీదారునికి సరియైన సరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్.) కార్య క్రమంలో జిల్లా విజయ కృష్ణన్, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, కె.కె.ఆర్.సి. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస. సుబ్బలక్ష్మి, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టరు శాఖలవారీగా పి.జి.ఆర్.ఎస్. పెండింగు అర్జీలపై సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ప్రస్తుతం పెండింగు అర్జీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ఈ రోజు వచ్చిన అర్జీలు వచ్చే వారం నాటికి పెండింగు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు తెలిపారు. అదికారులు అర్జీకి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవాలని, అర్జీదారునితో స్వయంగా మాట్లాడాలన్నారు. పరిష్కరించ గలగిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని అర్జీలగూర్చి అందుకు గల కారణాలు ధరఖాస్తు దారునికి తెలియజేయాలన్నారు. ఇతర శాఖలకు సంబంధించిన ధరఖాస్తులను వెంటనే వారికి పంపించి చర్యలు తీసుకోవాలని తెలిపారు.అర్జీలకు పరిష్కారం చూపడమేకాకుండా, పరిష్కారం కాని ధరఖాస్తులకు వివరంగా సమాధానం తెలియజేయుట ద్వారా ఐవిఆర్ఎస్‌లో ప్రజాభిప్రాయం సంతృప్తికరంగా వచ్చే విధంగా పనిచేయాలని తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో 440 అర్జీలు వచ్చాయి.

యువతకు అండగా వైసీపీ ఉద్యమ బాట : రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్

విశాలాంధ్ర - మునగపాక : ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 12న యువత పోరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మునగపాక వైసీపీ కార్యాలయంలో యువత పోరు కార్యక్రమానికి సంబంధించి పోస్టర్ను ఆయన వైసీపీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి,వైసీపీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్రెడ్డి పిలుపు మేరకు మార్చి 12న ఉదయం 10 గంటలకు ర్యాలీగా కలెక్టరేట్కు తరలివెళ్లి కలెక్టర్కు వినతిపత్రాన్ని సమర్పించ నున్నామన్నారు.రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేస్తు న్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి ఇస్తానన్న చంద్రబాబు మాట తప్పారు. పెండింగ్లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసినప్పటికీ.. ఇంత వరకు ప్రభుత్వం ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. విద్యార్థులు, యువత భవిష్యత్ పట్ల కూటమి ప్రభు త్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ప్రభుత్వం 5 త్రైమాసికాలుగా ఫీజు రీయంబ ర్స్మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధం గా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3000లు భృతి ఇవ్వాలని,కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయ త్నాలను ఉపసంహరించుకొని,పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులో ఉంచాలని డిమాండ్లపై జిల్లా కలెక్టర్ వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు.అందులో భాగంగానే నియోజకవర్గ ఇన్చార్జ్ లు,ముఖ్య నేతలు, నిరుద్యోగులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్ట బోతున్నా మన్నారు. వైసీపీ చేస్తున్న ఆందోళనతో కూటమి ప్రభుత్వానికి కళ్ళు తెరుచుకుంటాయని ఆశిస్తున్నామన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేస్తూ.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తూ.. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేంత వరకు చంద్ర బాబును వదిలే ప్రసక్తే లేదన్నారు.వైసీపీ ఆధ్వ ర్యంలో నిర్వహించ తలపెట్టిన యువత పోరు కార్యక్రమానికి యువకులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి, జయప్రదం చేయ వలసిందిగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, తిమ్మరాజుపేట గ్రామ ఉపసర్పంచ్ కాండ్రేగుల జగన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.